క్లుప్తంగా

19న మండల సర్వసభ్య సమావేశం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 19న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జోగు శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల మండల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

20న గరిడేపల్లి మండల సమావేశం..

గరిడేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 20న మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సేష్టన్ అధికారులు, సిబ్బంది

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగిఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి బాబా షర్ఫొద్దీన్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో కరపత్రాలు పంపిణీ చేసి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాబా షర్ఫొద్దీన్ మాట్లాడుతూ.. వేసవికాలంలో అగ్ని ప్రమాదాలను గ్రహించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది మసూద్ అహ్మద్, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, సైదులు, సూర్యానారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్రనామ పుష్పార్చన



పూజల్లో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో సహస్రనామ పుష్పార్చన కార్యక్రమాన్ని అర్చకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్రనామ పుష్పార్చనలు, సేవాకాలం, అలంకరణ, మంగళశాసనం, కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, గుండా రమేష్‌రేవతి, తల్లాడ వెంకటేశ్వర్లుసావిత్రి, అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, కిరణ్‌కుమార్‌గౌడ్, రమేష్, ఉపేందర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేత హేయమైన చర్య



మాట్లాడుతున్న నాయకులు

మునగాల : మండల కేంద్రంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, కోదాడ నియోజకవర్గ బీఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జ్ కన్మతరెడ్డి శశిధర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడం హేయమైన చర్య అని శశిధర్‌రెడ్డి యువసేన నాయకుడు రాయి రవి ఖండించారు. ఆదివారం మండల కేంద్రంలో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చించివేసిన ఫ్లెక్సీని పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గంలో శశిధర్‌రెడ్డి చేస్తున్న సామాజిక కార్యక్రమాలను జీర్ణించుకోలేని కొంతమంది ఇటువంటి పనులకు పాలపడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు దొంతగాని లింగయ్య, కోట వెంకటేశ్వర్లు, జిల్లేపల్లి వంశీ, వినయ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

మునగాల : మండలంలోని కృష్ణానగర్‌లో ఆదివారం విద్యుదాఘాతానికి గురై ఓ పాడి గేదె మృతి చెందింది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేతావత్ వెంకటేశ్వర్లు రోజువారిగా గేదెలను మేపేందుకు పొలాల్లోకి తీసుకెళ్లాడు. కాగా విద్యుత్ మోటార్‌కు వచ్చే వైరు పొలంలో గేదె కాళ్లకు చుట్టుకొని విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువు రూ.60వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

హరితహారానికి సన్నద్ధం..!



హరితహారం కోసం నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- 29నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు
- 2లక్షల 30వేలు నాటడమే లక్ష్యంగా ముందుకు..
- ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న అధికారులు

మఠంపల్లి : హరితహారానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా రానున్న వర్షాకాలంలో చేపట్టనున్న 9వవిడత హరితహారంలో అన్ని గ్రామపంచాయతీలు, ఆవాసగ్రామాల పరిధిలో మొక్కలు నాటేందుకు నర్సరీలను సన్నద్ధం చేస్తున్నారు. మఠంపల్లి మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో 29నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలుగా పెంచుతున్నారు. మండల వ్యాప్తంగా 42 ఆవాసప్రాంతాలలో తొమ్మిదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటింటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించనున్నారు. ఇళ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేస్తున్నారు. పలు మొక్కలను ప్రభుత్వ స్థలాలు, రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువుగట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్యశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో 2లక్షల 30వేల మొక్కలను నాటడమే లక్ష్యంగా నర్సరీల్లో పెంచుతున్నారు. గడిచిన 3మాసాల క్రితం ఆయాగ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి ప్రతి నర్సరీకి ఒకరి చొప్పున మొత్తం 29మంది వనసేవకులను నియమించారు. వారికి ఉపాధిహామీ పథకం కింద వేతనాలను అందజేస్తున్నారు. మరో 3మాసాలపాటు మొక్కలను మరింత ఏపుగా పెంచేందుకు నీటి సౌకర్యంతో పాటు సూర్యరశ్మి సమపాళ్లలో మొక్కలకు అందించేందుకు గ్రామపంచాయతీ నిధులతో ప్రతి నర్సరీకి గ్రీన్ నెట్‌షెడ్‌లను ఏర్పాటు చేశారు. విత్తనాలు సక్రమంగా మొలకెత్తని స్థానంలో తిరిగి విత్తనాలను నాటారు. ప్రతిగ్రామపంచాయతీ పరిధిలో హరితహారంలో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు సిద్ధం చేస్తున్నారు.

9వ విడత హరితహారంపై ప్రత్యేక శ్రద్ధ



మండలంలో మరో 3మాసాలలో చేపట్టనున్న 9వవిడత హరితహారం విజయవంతానికి చర్యలు తీసుకుంటున్నాం. మండల వ్యాప్తంగా ఉన్న 29గ్రామపంచాయతీల్లో 29 నర్సరీలు ఏర్పాటు చేసి 2లక్షల 30వేల మొక్కలను పెంచుతున్నాం. అన్ని వర్గాల సహకారాలతో హరితహారంలో విజయం సాధిస్తాం.

– మామిడి జానకిరాములు, ఎంపీడీఓ మఠంపల్లి

సమ్మేళనం విజయవంతంతో బీఆర్ఎస్‌లో జోష్



బతుకమ్మలతో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతున్న మహిళలు

కోదాడ : పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావడంతో ఆపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గడిచిన 10రోజులుగా ఈ సమావేశ నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించి చేసిన కృషి ఫలించిందని పలువురు ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. మంటుటెండలో సైతం అనుకున్నంత నాయకులు, కార్యకర్తలు సమావేశానికి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వార్డుకు రెండు బస్సులను ఏర్పాటు చేయడంతో సమావేశానికి పురుషులకంటే మహిళలు ఎక్కువగా హాజరయ్యారు. మహిళలు బతుకమ్మలతో వేదిక వద్దకు వచ్చారు. ముస్లిం, మైనార్టీ యువకులు మంత్రిని, ఎమ్మెల్యేను కలిపి గజమాలతో సత్కరించారు.

కోదాడను అభివృద్ధిలో నడిపించా : ఎమ్మెల్యే

నియోజకవర్గ ప్రజలు, నాయకులు అందించిన సహకారంతో నియోజకవర్గాన్ని గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో అభివృద్ధి పథంలో నడిపించానని, మున్ముందు ఇదే ఒరవడిని కొనసాగిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పి.సత్యబాబు, అల్తాఫ్ హుస్సేన్, ఎస్‌కె నయీం, సుంకర అజయ్‌కుమార్, ఈదుల కృష్ణయ్య, బజ్జూరి వెంకటరెడ్డి, కల్లూరి పద్మజ, బెజవాడ శిరీష, పాదర్ యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌మార్చ్‌కు తరలిన ఉద్యోగులు



పెన్షన్ మార్చ్‌కు వెళ్తున్న ఉద్యోగులు

కోదాడఅర్బన్ : సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సూర్యాపేటలో నిర్వహించిన పెన్షన్ మార్చ్‌కు కోదాడ డివిజన్ నుంచి సీపీఎస్ ఉద్యోగులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వాహనాల ర్యాలీని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఆయన మాట్లాడారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చే పెన్షన్ బిక్షకాదని, ఉద్యోగుల హక్కు అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు ఏడుకొండలు, పి.అంకులయ్య, కె.కరుణాకర్, యల్లయ్య, ఖాసీం, శ్రీనివాస్, మదన్‌మోహన్, వెంకన్నగౌడ్, ఆంజనేయులు, శ్రీను, అంజయ్య, జ్యోతి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి సీపీఐ రాజీలేని ఉద్యమాలు



పార్టీలో చేరినవారితో గన్నా చంద్రశేఖర్

నేరేడుచర్ల : పేదల సంక్షేమం కోసం సీపీఐ పార్టీ రాజీలేని ఉద్యమాలు చేపడుతుందని, బడుగు, బలహీన వర్గాల పేదలకు నాటి నుంచి నేటి వరకు అండగా కమ్యూనిస్ట్ పార్టీ నిలుస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన పలువురు యువకులు గన్నా చంద్రశేఖర్ సమక్షంలో సీపీఐలో చేరారు. వారికి ఆయన కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ అనేది ఒక రాజకీయ స్వచ్ఛంద సేవా సంస్థ అని, నాటి నుంచి పేదలకు అండగా ఉంటూ ఉద్యమాలు చేపడుతుందన్నారు. సీపీఐ చేస్తున్న ప్రజా పోరాటాలకు స్పందిస్తున్న యువకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కూడా మండలంలో 90శాతం వరకు బస్సు సౌకర్యంలేని గ్రామాలున్నాయని, నేరేడుచర్లకు బైపాస్ రోడ్డు కావాలనే అనేక సార్లు వినతులు ఇచ్చినా కూడా ఎలాంటి స్పందన కనబడటం లేదన్నారు. నేరేడుచర్లలో పాలిటెక్నిక్ కళాశాల, పాలకవీడు మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రావుల సత్యం, లక్ష్మి, చిలకరాజు శ్రీను, ఉదర వెంకన్న, ఉపేందర్, శ్రీను, శ్రీరాములు, భిక్షం, వెంకన్న తదితరులున్నారు.

లేఅవుట్ స్థలాల ఆక్రమణలను నిరోధించాలి



ప్రజాచైతన్య యాత్ర ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలోని లేఅవుట్ స్థలాల ఆక్రమణలను నిరోధించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు అన్నారు. ఇంటింటికి సీపీఐ ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ లేఅవుట్ స్థలాలు ఆక్రమణలను నిరోధించాలని, వెంచర్ల ఏర్పాటులో అక్రమాలను తొలగించాలన్నారు. స్థానిక రామస్వామి గుట్ట వద్ద నిర్మించి నిరుపయోగంగా ఉన్న గృహసముదాయాలను అర్హులైన పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన రింగురోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఎన్నెస్పీ కాలువ నిర్వాసితులు అందరికీ తగిన న్యాయం చేయాలని, ఈఎస్ఐ, ఏరియా ఆస్పత్రిలో 100శాతం వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పాలకూరి బాబు, కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, కొప్పోజు సూర్యనారాయణ, గుండా రమేష్, సుందరి పద్మ, యల్లావుల ఉమ, పొనుగుపాటి వాసుదేవరావు, మామిడి వెంకయ్య, జడ వెంకన్న, సత్యవతి, కృష్ణ, రమేష్, మోహన్‌రావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల గోకులయాదవ అన్నదాన సత్రం అభివృద్ధికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన యాదవులు సహకరించాలని సత్రం కమిటీ గౌరవాధ్యక్షుడు ఎం.ఎం.యాదవ్ కోరారు. ఆదివారం స్థానిక అన్నదానసత్రంలో నిర్వహించిన సత్రం కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 4న మట్టపల్లిలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు రెండు రాష్ట్రాల యాదవ భక్తులకు అన్నదానసత్రంలో భోజనవసతి ఏర్పాట్లకు ప్రతిఒక్కరూ ఆర్థికంగా సహకరించాలని అన్నారు. సమావేశంలో సత్రకమిటీ ప్రధాన కార్యదర్శి చింతకాయల శ్రీనివాస్, పల్నాడు జిల్లా మాచవరం జెడ్పీటీసీ శివయాదవ్, వేమవరం సర్పంచ్ రోశయ్య, వెంకటేశ్వర్లు, క్రిష్ణమూర్తి, నర్సయ్య, సూర్యనారాయణ, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటులకు ఘన సన్మానం



రంగస్థల నటులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 155వ జయంతిని పురస్కరించుకొని తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ప్రసిద్ధ తెలుగు రంగస్థల నటులు దొంతగాని వెంకటేశ్వర్లు, శివరాంనాయక్, బాలునాయక్‌ను నేరేడుచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు యడవల్లి సత్యనారాయణరెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు మాట్లాడారు. తెలుగు నాటక రంగ అభివృద్ధికి, సమాజంలోని మూఢాచారాలను రూపు మాపేందుకు వీరేశలింగం పంతులు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. సంస్కృతి, సాంప్రదాయాలకు ఒక తరం నుంచి మరో తరంకు అందించే క్రమంలో కళలు ప్రధాన భూమిక పోషిస్తాయని అన్నారు. ప్రస్తుతం కళాకారులకు సమాజంలో ఆదరణ తగ్గిందని, ఈ దోరణి మారిపోయి కళలకు పూర్వ వైభవం రావాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు పోరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, అధ్యక్షుడు కందిబండ శ్రీనివాసరావు, కార్యదర్శి చల్లా ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి జిలకర రామస్వామి, ఉపాధ్యక్షుడు కర్రి సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, వెంకన్న, లక్ష్మారెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని తిలక్‌నగర్‌లో చెట్టుపైనుంచి పడి చికిత్స పొందుతున్న కె.నాగార్జున కుటుంబానికి ఆదివారం దాత తుమ్మకొమ్మ బాలరాజు రోజమ్మ ఇచ్చిన రూ.4వేల ఆర్థికసాయాన్ని అంబేడ్కర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో యోహాన్, ఇనియేల్, ఇర్మియ, ఏసురత్నం, బాబూరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



చిల్లెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

నేరేడుచర్ల : రైతుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వం రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందన్నారు. మధ్య దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. అదే విధంగా పాత నేరేడుచర్లలో నూతనంగా నిర్మించనున్న ఈద్గా స్థలాన్ని, రాజీవ్‌నగర్‌లోని కబరస్తాన్ ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు ఇంజమూరి రాములు, మైనార్టీ నాయకులు ఖాదర్‌లు గుండె చికిత్స చేసుకోగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మున్సిపల్ వైస్‌చైర్మన్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ కొణతం సత్యనారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, తహసీల్దార్ సరిత, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ వీరయ్య, పార్టీ మండల కార్యదర్శి లింగయ్య, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీకాంత్, అనంత్ శ్రీను, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులున్నారు.

దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి

దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చిల్లెపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడలేని విధంగా హైదరాబాద్‌లో బీఆర్ అంబేద్కర్ 125అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి దళితులపై ఉన్న అభిమానాన్ని కేసీఆర్ చాటుకున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా అమలు చేయని దళిత బంధు పథకాన్ని తెలంగాణలో మాత్రమే కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేశారని అన్నారు. అంబేద్కర్ ఆశయ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు అరిబండి సురేష్‌బాబు, చల్లా శ్రీలతారెడ్డి, ఎంపీపీ లకుమళ్ల జ్యోతి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, మండల రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీను, శ్రీకాంత్, మండల కార్యదర్శి లింగయ్య, నాయకులు నారాయణరెడ్డి, రమేష్‌బాబు, తదితరులున్నారు.

ప్రశాంతంగా ముగిసిన మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష



మునగాల : విద్యార్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



నడిగూడెంలోని గురుకుల పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్సీఓ అరుణకుమారి

గరిడేపల్లి : మండలంలోని మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతి ప్రవేశాలకు ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు, 7నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్న 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించారు. 6వ తరగతిలోకి ప్రవేశపరీక్షకు 31మంది హాజరుకాగా, 7వ తరగతి నుంచి 10వ తరగతి పరీక్షకు 25మంది విద్యార్థులు హాజరైనట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఐతరాజు సుధాకర్ తెలిపారు. మే 24న పరీక్షా ఫలితాలు వెలువడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు తెలంగాణ ఎంఎస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పరీక్షా ఫలితాలను చూసుకోవచ్చన్నారు.

మునగాల : మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ 2023-24వ విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశంతో పాటు, 7,8,9,10తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతగా ముగిసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మద్దూరి సాయిఈశ్వరి తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన గురుకుల ప్రవేశ పరీక్ష..

నడిగూడెం : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం 7వ తరగతిలో మిగిలిన సీట్ల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 480 మంది విద్యార్థులను కేటాయించగా 412 మంది హాజరయ్యారు. ఈ పరీక్షను సాంఘీక సంక్షేమ గురుకుల సంస్థ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హెచ్.అరుణకుమారి పరిశీలించారు. ఆమె వెంట పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, డిపార్ట్‌మెంటల్ అధికారి సైదులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 6,7,8,9 తరగతులకు నిర్వహించిన ఈ ప్రవేశపరీక్షకు 5152 మంది హాజరైనట్లు అరుణకుమారి విలేకరులకు వెల్లడించారు.

ఎంపీటీసీని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పద్మావతి

మునగాల : మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో ఈనెల 14న మండల ఎస్ఐ చేయిచేసుకోవడంతో గాయపడిన కొక్కిరేణి ఎంపీటీసీ ఎర్రం శ్రీనివాసరెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకుల అండదండలతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయన్నారు. కాంగ్రెస్ ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డిపై ఎస్ఐ అకారణంగా చేయిచేసుకోవడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు ఎస్ఐపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరగా పూర్తిస్థాయిలో విచారణ చేసి త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఎంపీటీసీపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం పట్ల తీవ్రంగా ఖండించారు. ఆమె వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మండవ చంద్రయ్య, నాయకులు దేవినేని రవి, కాలె సామియేలు, స్థానిక సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు ఉన్నారు.



ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న పద్మావతి

సీపీఎం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న జూలకంటి రంగారెడ్డి

హుజూర్‌నగర్ : రంజాన్ పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పెద్ద మసీదులో సీపీఎం ఆధ్వర్యంలో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఎం రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందు ఆరగించారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ.. మత సామరస్యాన్ని కాపాడడంలో సీపీఎం పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగారపు పాండు, శీలం శ్రీను, పల్లె వెంకటరెడ్డి, హుస్సేన్, దుగ్గి బ్రహ్మం, ఎస్‌డీ రఫీ, అప్పారావు, ముస్లిం పెద్దలు బాజీవుల్లా, తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే హజ్ బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తా

భానుపురి : రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే సూర్యాపేట జిల్లా కేంద్రంలో హజ్ బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తానని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక పబ్లిక్‌క్లబ్ ఏర్పాటు చేసిన దావత్ -ఏ - ఇఫ్తార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ముస్లింలు ప్రజలందరి శ్రేయస్సు కోసం కఠిన నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు చేస్తారని తెలిపారు. ఈ దీక్షలు ఫలించి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అన్ని కులాలు, మతాలకు సమాన హక్కులు కల్పించి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రదేశంగా నిలిపిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. రానున్న రోజుల్లో ముస్లింలంతా పార్టీకి అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖబరస్తాన్ కమిటీ చైర్మన్ జహీరొద్దీన్, ఈద్గా కమిటీ చైర్మన్ కరీం సాబ్, హఫీజ్ ఖలీల్, జలీల్, బురాన్, బాసిత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షఫీఉల్లా, ఫరూక్, గట్టు శ్రీనివాస్, గోదల రంగారెడ్డి, స్వామినాయుడు, సైదిరెడ్డి, గోపాల్‌రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాంపు ఉన్న జీవాలనే కొనాలి

సూర్యాపేట : పట్టణంలో కబేళా నందు పశువైద్యాధికారి పరీక్ష చేసిన తర్వాత మున్సిపల్ స్టాంపు గుర్తు ఉన్న గొర్రెలు, మేకలను మాత్రమే కొనుగోలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కబేళా నందు వెటర్నరి డాక్టర్ జానయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బండ జనార్దన్ రెడ్డిలు గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసిన మాంసాన్ని మాత్రమే అమ్మాలని ఉల్లంఘిస్తే మాంసం షాపుని జప్తు చేయడంతో పాటు పెనాల్టీ విధించనున్నట్లు తెలిపారు.



గొర్రెలు, మేకలను పరిశీలిస్తున్న అధికారులు